## ఆవిర్భావ వేడుకల పనులను పరిశీలించిన మాజీ మంత్రి


మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, మే 31 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం కైలాష్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ ఏర్పాట్లను కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. విద్యుత్ కాంతులతో పార్టీ కార్యాలయం ముస్తాబు చేశారు. ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేసే దిశగా గ్రామ, పట్టణాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు ఉదయం 8 గంటలకు జెండాలను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో 9 గంటలకు జాతీయ జెండాతోపాటు బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న, పరమేశ్వర్, అష్రాఫ్, కొండ గణేశ్, అన్నెలా వసంత్, ఉగ్గే విఠల్, దయాకర్, అశోక్ పాల్గొన్నారు.

## బ్యాంకు మేనేజర్‌పై ఖాతాదారుల ఆగ్రహం



బజార్‌హత్నూర్ మండలంలోని దేగామ బ్యాంకు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఖాతాదారులు

బజార్‌హత్నూర్, మే 31 : దేగామ గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ వినీత్‌కుమార్ దురుసుగా మాట్లాడుతున్నాడని, ఇదేంటి అని ప్రశ్నిస్తే 'మీ ఇష్టం ఉన్న చోట చెప్పుకోం డి.. నేను ఇలాగే మాట్లాడుతా..' అని ఖాతాదారులను బెదిరించడంతో శనివారం గ్రామస్తులు, ఖాతాదారులు బ్యాంకు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్యాంకు మేనేజరుని బదిలీ చేయాలని ఖాతాదారులు, గ్రామస్తు లు డిమాండ్ చేశారు. బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించగా.. గ్రామస్తులు సమస్యలను తెలుపగా.. పరిష్కరించానని పేర్కొన్నారు.

● ఆకాశమంత ఎత్తులో కేసీఆర్

మంచిర్యాల జిల్లా రాజీవ్‌నగర్‌లో నిర్మాణం పూర్తి చేసుకుని పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లు



● పునాది దశలో రేవంత్

జైపూర్ మండలంలోని గంగిపెల్లి గ్రామంలో బేస్‌మెంట్ దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లు



# ఇందిరమ్మా.. ఇదేందమ్మా!


**డబుల్ బెడ్రూం ఇండ్లను పక్కన పెట్టి.. ఇందిరమ్మ ఇండ్ల పంపిణా?**

- 2 బీహెచ్‌కే ఇండ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నా పట్టించుకోని ప్రభుత్వం
- జూన్ 2 నుంచి ఇందిరమ్మ ఇండ్ల పంపిణీకి సన్నద్ధం
- కాంగ్రెస్ సర్కారు తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

*పేద, మధ్య తరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసే ఉద్దేశంతో కేసీఆర్ సర్కారు డబుల్ బెడ్రూం ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 2 బీహెచ్‌కే ఇండ్లను నిర్మించింది. కొన్నింటిని లబ్ధిదారులకు అప్పగించగా.. మరికొన్ని నిర్మాణాలు పూర్తి చేసుకుని పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. కొన్నేమో 90 శాతం పనులు పూర్తి చేసుకుని ఫినిషింగ్ స్టేజీలో ఆగిపోయాయి. కొన్ని చోట్ల లబ్ధిదారుల ఎంపిక చేసినా.. ఇండ్లను వారికి అప్పగించలేదు. ఈ క్రమంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. మండలానికి ఒకటి చొప్పున ఎంపిక చేసిన పైలెట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల పనులను మొదలుపెట్టింది. జూన్ 2వ తేదీ నుంచి లబ్ధిదారులకు ఇండ్లు పంపిణీ చేసేందుకు సన్నద్ధమైంది. ఇక్కడి దాకా బాగానే ఉన్నా.. గత సర్కారు హయాంలో డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీని పూర్తిగా విస్మరించింది. ఆ ఊసే ఎత్తకుండా ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ చేస్తామంటూ ప్రకటించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.*

*- మంచిర్యాల, మే 31(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*






### ఒకవైపు వ్యతిరేకత.. మరోవైపు పూర్తికాని పనులు..

ఇందిరమ్మ ఇండ్లకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, వారి అనుచరులనే ఎంపిక చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ మేరకు చాలా గ్రామాల్లో నిరుపేద, మధ్య తరగతి కుటుంబాల జనం అధికారులను నిలదీస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసే సర్వే కోసం వచ్చిన అధికారులను అడ్డుకుంటున్నారు. ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. జనం నుంచి వ్యతిరేకత వస్తున్నా.. పట్టించుకోకుండా ఇండ్ల పంపిణీకి సర్కారు సై అంటున్నది. పనులైనా పూర్తయ్యాయా అంటే అదీ లేదు. మంచిర్యాల జిల్లాలో మూడు నియోజకవర్గాలకు కలిపి 2,150 ఇండ్లు మంజూరు ఇచ్చారు. వీటిలో 914 ఇండ్ల నిర్మాణం ప్రారంభం కాగా, 179 ఇండ్లు పునాది వరకు వచ్చాయి. మూడు ఇండ్లు రూఫ్ లెవల్‌లో ఉన్నాయి. ఇంకా నిర్మాణాలు పూర్తి కాలేదు. జిల్లాలో 2,10,206 దరఖాస్తులు రాగా, కేవలం 2 వేల మందినే ఎంపిక చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో 2,148 ఇండ్లు మంజూరు కాగా మంచిర్యాల జిల్లాలో మాదిరి పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. నిర్మల్ జిల్లాలోని 18 మండలాల్లో 769 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయి. ఇందులో 356 ఇండ్లను భూమి పూజలు చేశారు. 102 ఇండ్లు బేస్మెంట్ లెవల్‌లోఉండగా, కేవలం ఎనిమిది ఇండ్లకు గోడల నిర్మాణం పూర్తయ్యింది. ఇంకా ఏ ఒక్క ఇంటి నిర్మాణం కూడా 100 శాతం అవ్వలేదు. ఆసిఫాబాద్ జిల్లాల్లో ఇందిరమ్మ ఇండ్లు 1,653 మంజూరు కాగా, 792 ఇండ్ల నిర్మాణాలు మొదలుపెట్టారు. వీటిలో 250 ఇండ్లు బేస్‌మెంట్ లెవల్‌దాకా పూర్తయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసుకున్నా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఇంకా పూర్తికాలేదు. ఇప్పట్లో అయ్యే పరిస్థితి కూడా కనిపించడం లేదు. సర్కా రు మాత్రం జూన్ 2వ తేదీ నుంచి పంపిణీకి సిద్ధం అవుతుంది. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా ఉండగా పంపిణీ ఎలా సాధ్యం అవుతున్నదనేది అర్థం కాకుండా పోయింది.

### 2 బీహెచ్‌కే ఇండ్ల పంపిణీపై నీలినీడలు..

పనులు పూర్తి కాని ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామంటున్న సర్కార్.. పనులు పూర్తయి పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పట్టించుకోవడం లేదు. కేసీఆర్ హయాంలో నిర్మించిన 2 బీహెచ్‌కే ఇండ్ల ప్రస్తావనే ఎక్కడా తీసుకురావడం లేదు. దీంతో కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన టూ బీహెచ్‌కేలు నిరుపయోగంగా మారాయి. మెయింటేనెన్స్ లేక పాడైపోయి శిథిలావస్థకు చేరుతున్నాయి.

- ఆదిలాబాద్ జిల్లాకు 2,271 ఇండ్లు మంజూరు కాగా 606 డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం పూర్తయ్యింది. మరో 1023 ఇండ్లు 90 శాతం పనులు పూర్తి చేసుకున్నాయి. మిగిలిన ఇండ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ఇప్పటికే తాంసి మండలంలో 100 మందికి 2 బీహెచ్‌కే ఇండ్లను పంపిణీ చేశారు. ఆదిలాబాద్‌లో ఓ 200 మందికి ఇండ్లను అప్పగించగా, ఆదిలాబాద్ టౌన్‌లో కేఆర్‌కే కాలనీలో 200, జైనథ్‌లో 100 ఇండ్ల నిర్మాణం పూర్తయ్యింది. కానీ.. వాటిని లబ్ధిదారులకు అప్పగించలేదు. కాలం గడుస్తుండడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి.
- ఆసిఫాబాద్ జిల్లాలో 1,223 డబుల్ బెడ్రూం ఇండ్లను అప్పటి కేసీఆర్ సర్కారు మంజూరు చేసింది. జిల్లాలో జోడేఘాట్, జైనూర్ మండలాల్లో 26 ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి, వాటిని లబ్ధిదారులకు అప్పగించారు. కాగజ్‌నగర్ నియోజకవర్గంలో 288 ఇండ్ల నిర్మాణం 90 శాతం పూర్తయ్యింది. లబ్ధిదారులను ఎంపిక చేశారు తప్పితే ఇండ్ల కేటాయింపులు చేయలేదు. మిగిలిన ఇండ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.
- నిర్మల్ జిల్లాలో 2511 ఇండ్ల నిర్మాణం పూర్తయ్యింది. మరో 2029 ఇండ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. నిర్మల్‌లో 1460, ఖానాపూర్‌లో 400, భైంసాలో 200, తిమ్మాపూర్‌లో 16, కడ్తాల్‌లో 50, గంజాల్‌లో 40, పాక్‌పట్లలో 50 ఇండ్లు పూర్తయ్యాయి. ఎల్లపెల్లి గ్రామంలో 69, చిట్యాలలో 71, రత్నాపూర్ కాండ్లీలో 50, లక్ష్మణచాంద మండలం కూచన్‌పెల్లిలో 30, బోరిగాంలో 25, సారంగాపూర్ మండలం డ్యాంగాపూర్‌లో 50 ఇండ్లను లబ్ధిదారులకు అందజేశారు. నిర్మల్ టౌన్‌లో పంపిణీ పూర్తయ్యింది. ఇక మిగిలిన వాటి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది.
- మంచిర్యాల జిల్లాలో 2616 డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరయ్యాయి. మంచిర్యాల నియోజకవర్గానికి 650 ఇండ్లు కేటాయించారు. వీటిలో 360 ఇండ్ల నిర్మాణం పూర్తయ్యింది. రెండు విడుతలుగా లబ్ధిదారులను లక్కీ డ్రా తీసి, కలెక్టర్ సమక్షంలో అత్యంత పారదర్శకంగా ఎంపిక చేశారు. చెన్నూర్ నియోజకవర్గానికి 1146 ఇండ్లు మంజూరయ్యాయి. మందమర్రిలో 560, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో 286, చెన్నూర్‌లో 300 ఇండ్లను కేటాయించారు. వీటిలో 194 ఇండ్లు మినహా మిగిలిన ఇండ్ల నిర్మాణం పూర్తయినా పంపిణీకి నోచుకోలేదు. ఇక బెల్లంపల్లి నియోజకవర్గానికి 425 డబుల్ ఇండ్లకు మంజూరు ఇచ్చారు. పనులు చేపట్టాల్సి ఉంది.

### డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీకి డిమాండ్..

కేసీఆర్ సర్కారు హయాంలో డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణానికి నిధుల మంజూరు, పనులు శరవేగంగా సాగాయి. కొన్ని చోట్ల వాటిని లబ్ధిదారులను పంపిణీ చేయగా.. చాలా వరకు పనులు పూర్తి చేసుకుని పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక వాటిని పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. కొన్ని చోట్ల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారుతున్నాయి. ఇప్పటికే లబ్ధిదారులు ఎంపికైన ప్రాంతాల్లో కేటాయింపులు చేయలేదు. కనీసం అవి చేసినా వేలాది మంది గృహ ప్రవేశాలు చేసుకునేవారు. మిగిలిన వాటి పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తే బాగుండేది. కానీ కాంగ్రెస్ సర్కార్ ఆ దిశగా ఆలోచనలు చేయకపోవడం విమర్శలకు తావిస్తున్నది. డబుల్ ఇండ్లను పంపిణీ చేస్తే బీఆర్ఎస్‌కు ఎక్కడ పేరు వస్తుందోననే ఉద్దేశంతో పంపిణీని బ్రేక్‌లు వేసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజకీయాలను పక్కన పెట్టి కోట్ల రూపాయాల ప్రభుత్వ నిధులతో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను వెంటనే పంపిణీ చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు. ఇప్పటికేనా డబుల్ బెడ్రూం ఇండ్లపై సర్కారు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గోదావరికి సమీపంలోని దారిలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న రాంపూర్ గ్రామ మత్స్యకారులు



## చింతమడుగే జీవనోపాధి

● రాంపూర్ గ్రామ మత్స్యకారులు

● మేము నష్ట పోతున్నం : దస్తురాబాద్ మత్స్యకారులు ● గోదావరి వద్ద ఉద్రికత

● సమస్యలను పరిష్కారించే వరకు చేపల వేట వెళ్లవద్దు : ఏడీ

దస్తురాబాద్, మే 31 : భూత్కుర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాంపూర్ గ్రామ శివారులో గల గోదావరిలోని చింతమడుగే మాకు జీవనోపాధి అని రాంపూర్ గ్రామ మత్స్యకారులు అన్నారు. రాంపూర్ గ్రామ శివారులోని గోదావరికి వెళ్లే దారిలో మత్స్యశాఖ అధికారుల తీరుపై ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మా పూర్వీకులు గోదావరికి సమీపంలో చేపల వేట కొనసాగించారు. ఈ మడుగే మా పిల్ల భవిష్యత్ అని అన్నారు. మేము ఎవరి పరిధిలోకి పోము, మా పరిధిలోకి ఎవరిని రానివ్వం అని పేర్కొన్నారు. ఏడీ, ఎఫ్‌డీవో నిర్లక్ష్యం నశించాలని, పాత పద్ధతిలోనే లైసెన్స్‌లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు అధికారులు చెప్పిన విధంగా దస్తురాబాద్ గ్రామ మత్స్యకారులు చేపల వేటకు రావడంతో మళ్లీ శనివారం గోదావరి వద్ద ఉద్రికత్త పరిస్థితులు నెలకున్నాయి. దస్తురాబాద్, కడెం ఎస్ఐలు సాయి కుమార్, కృష్ణ సాగర్ రెడ్డి ఘటన స్థలానికి చేరుకున్నారు. దస్తురాబాద్ గ్రామ మత్స్యకారులను గంగమ్మ గుడి వద్దకు పంపారు. ఎలాంటి ఘర్షణలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు.

### సమస్యను పరిష్కారించే వరకు చేపల వేట వెళ్లవద్దు

తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బత్తుల విశ్వంబర్, జిల్లా మత్స్య శాఖ అధికారి ఏడీ రాజనర్సయ్య, ఎఫ్‌డీవో విజయ్ కిరాంకర్, ఖానాపూర్ సీఐ అజయ్‌లు దస్తురాబాద్, రాంపూర్ గ్రామాల మత్స్యకారులతో మాట్లాడారు. ఇరు వర్గాల సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సమక్షంలో మత్స్యకారులతో మాట్లాడుతామని ఏడీ తెలిపారు. అప్పటి వరకు దస్తురాబాద్, రాంపూర్ గ్రామాల మత్స్యకారులు గోదావరివరి చేపల వేటకు వెళ్లవద్దు అని సూచించారు.

## మైక్రో ఫైనాన్స్‌ల ఆగడాలు

● మహిళా సంఘాలకు గాలం ● అమాయకులే లక్ష్యంగా ఆర్థిక వ్యాపారం ● తక్కువ వడ్డీకే రుణాల పేరిట వల ● రుణాల రికవరీ కోసం వేధింపులు

నిర్మల్, మే 31(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలో మైక్రో ఫైనాన్స్‌ల లొల్లి మొదలైంది. రెండేళ్ల క్రితం వరకు పెద్ద ఎత్తున తమ కార్యకలాపాలను సాగించి వివాదాల్లో కూరుకుపోయిన ఈ మైక్రో ఫైనాన్స్ సంస్థలు అప్పటి నుంచి కనుమరుగయ్యాయి. అప్పట్లో పోలీసులు అక్రమ మైక్రో ఫైనాన్స్‌లపై కఠిన చర్యలు తీసుకోవడంతో వారంతా గతంలోనే తోకముడిచారు. అయితే కొంత కాలం నుంచి మళ్లీ చాపకింద నీరులా పలు ప్రైవేటు మైక్రో ఫైనాన్స్ సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించాయి. ఈ మైక్రో ఫైనాన్స్ సంస్థలకు చెందిన సిబ్బంది గ్రామాలు, పట్టణాల్లోని స్లమ్ ఏరియాల్లో నివసించే కొంతమంది మహిళా పొదుపు సంఘాల సభ్యుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వారి సహకారంతో ఇతర మహిళలకు బలవంతంగానే రుణాలు అంటగట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. మొదట్లో అతి తక్కువ వడ్డీ అని చెప్పి రుణాలు ఇచ్చిన ఈ మైక్రో ఫైనాన్స్ సంస్థలు, ఆ తర్వాత వాయిదాల రూపంలో రుణాలు తీసుకున్న మహిళల నుంచి ఎక్కువ వడ్డీ వసూలు చేస్తుండడం వివాదాలకు కారణమవుతున్నది. ఇటీవల నిర్మల్ పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన దాదాపు 100 మందికి పైగా మహిళలు కలెక్టర్‌ను కలిసి స్వయంగా ఫిర్యాదు చేసి మైక్రో ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు.


ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు భారీ సంఖ్యలో వచ్చిన మహిళలు(ఫైల్)

### అధిక వడ్డీ వసూళ్లు

కొన్ని మైక్రో ఫైనాన్స్ సంస్థలు అమాయక మహిళలకు అవసరం లేకున్నా రుణాలు ఇచ్చి వారి నుంచి వాయిదాల రూపంలో వడ్డీ డబ్బులను అధికంగా వసూలు చేస్తున్నాయి. ఒకటి, రెండు రోజులు వడ్డీ చెల్లింపులు ఆలస్యమైతే మహిళలకు పెద్ద మొత్తంలో జరిమానాలు విధిస్తూ వారి నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నాయి. అధిక వడ్డీపై మహిళలు ప్రశ్నిస్తే మైక్రో ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు దురుసుగా మాట్లాడుతున్నారు. అసలు డబ్బులతోపాటు వడ్డీ డబ్బులు చెల్లించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామంటూ మహిళలను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రుణాలు తీసుకున్నవారితోపాటు గ్యారెంటీగా ఉన్న వారిని వేధింపులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. మైక్రో ఫైనాన్స్ సిబ్బంది వసూళ్ల కోసం తమ ప్రాంతాల్లోకి వస్తున్నారంటేనే రుణాలు తీసుకున్నవారు వణికి పోతున్నారు. ఇప్పటికైనా వారి ఆగడాలకు చెక్ పెట్టాలని బాధితులు కోరుతున్నారు.

## పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

**ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్**

ఎదులాపురం, మే 31 : ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ప్రపంచ టొబాకో నిరోధక దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆదిలాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా పోలీసు సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు దంత వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... టొబాకో, వాటి ఉత్పత్తుల వినియోగం, సిగరెట్, గుట్కా, జర్దా వంటి ఉత్పత్తుల వల్ల క్యాన్సర్, గుండెపోటు, శ్వాసకోశ వ్యాధులకు కారణమవుర న్నారు. సిబ్బంది స్వీయ నియంత్రణ పాటిస్తూ టొబాకో ఉత్పత్తులకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి సురేందర్‌రావు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు బి సునీల్ కుమార్, సిహెచ్ కరుణాకర్‌రావు, కె ఫణిదర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి వెంకటి, టి మురళి, చంద్రశేఖర్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సాయిరామ్, ప్రధాన కార్యదర్శి చిన్మయ్ వాజే, కోశాధికారి డి. సజీవ్, సభ్యులు డాక్టర్లు దీపిక, అమూల్య, భావన, కావ్య నాయక్, ఆనంద్, సమియుద్దీన్, విశాల్ అడే, నిఖిల్‌రెడ్డి, భార్గవ్‌కృష్ణ, రామకృష్ణారెడ్డి, అరుణ్ బడావత్, రాహుల్ నాయక్, కిరణ్ పవార్డా, సంతోష్ పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్